## క్లుప్తంగా

### క్లోరినేషన్‌తోనే వ్యాధుల నియంత్రణ



క్లోరినేషన్ చేయిస్తున్న చైర్మన్, కమిషనర్

రాయికల్: పట్టణంలో క్లోరినేషన్ చేయడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. మంగళవారం రాయికల్‌లోని వాటర్ ట్యాంక్‌ల్లో మున్సిపల్ సిబ్బందితో క్లోరినేషన్ చేయించారు. అంతేకాకుండా నిలువ ఉన్న నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పెద్దచెరువు కట్టపై నిర్మిస్తున్న మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, నాయకులు అచ్యుత్ రావు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా, ఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

### తాగునీటిని పరిశీలించిన జలజీవన మిషన్ అధికారి



సన్మానిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ, ఎర్దండి, గోధూర్ గ్రామాల్లో తాగునీటిని జల జీవన మిషన్ టీం ప్రతినిధి సుధాకర్ మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా ఏ విధంగా అవుతుంది. రక్షిత మంచినీటి ట్యాంకులను పరిశీలించి, కొంత మంది ఇళ్ల వద్దకు వెళ్లి తాగునీటిని పరిశీలించి, క్లోరినేషన్ ఏ విధంగా ఉందో తనిఖీ చేశారు. తాగునీరు సరాఫరా ఏ విధంగా అవుతుందో ఇంటింటికి వెళ్లి ఇంటి యాజమానులను అడిగి తెలుసుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆనంద్, ఏఈ అఖిల్, పంచాయతీ కార్యదర్శి హర్షద్, సిబ్బంది కనకయ్య, దేవేందర్, అనిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### కేజీబీవీ నిర్మాణానికి స్థల పరిశీలన



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బుగ్గారం: మండలంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్మించడానికి అనువైన స్థలం కోసం మంగళవారం అధికారులు స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామశివారులోని గోపులాపూర్ రోడ్డును ఆనుకుని ఉన్న ఎదురుబోర్ల ప్రాంతాన్ని జిల్లా సెక్టోరల్ అధికారి,జీసీడీవో అనుపమ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల మేరకు కేజీబీవీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాపురెడ్డి,స్నేహలత,కాంప్లెక్స్ హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, సీఆర్పీ పురుషోత్తం పాల్గొన్నారు.

### రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలి

రాయికల్: రైతులు తప్పనిసరిగా కెపాసిటర్లు బిగించుకోవాలని, దీని వల్ల విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ఏడీఈ హరీశ్ అన్నారు. మంగళవారం రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్, చింతలూరు గ్రామాల్లో విద్యుత్ పొలంబాట నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల పొలాల వద్దకు వెళ్లి కెపాసిటర్లు పెట్టుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆయన వెంట ఒడ్డెలింగాపూర్ ఏఈ రాజేశం, లైన్‌మెన్ రఘుపతి ఉన్నారు.

### విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

ధర్మపురి:వర్షాకాలంలో రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీ ఈటి సింధూర్‌శర్మ అన్నారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాయపట్నంలో మంగళవారం గ్రామస్తులు, రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ఓ రైతు పొలం వద్దకెళ్లి విద్యుత్ ప్రమాదాలు ఎలా జరుగుతాయో వివరించారు. గాలి దుమారాలు, వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు, వంగిన, వైర్లు తెగిపడిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు పశువులు వెళ్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. స్టార్టర్లకు కెపాసిటర్లను అమర్చుకుంటే మోటార్లు కాలిపోకుండా ఉంటాయని అన్నారు. ఏఈ బండారి అశోక్, లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, రైతులు తదితరులున్నారు.

# జగ్గాసాగర్‌లో జ్వరాల పంజా

- రోగాలతో బాధపడుతున్న ప్రజలు
- ఇంటికి ఇద్దరు, ముగ్గురు మంచాన



జగ్గాసాగర్‌లో ఇంటింటికీ తిరుగుతున్న వైద్యాధికారి అంజిత్‌రెడ్డి,అధికారులు, సిబ్బంది

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్‌లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలోని పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. గ్రామంలోని ఒక్కో ఇంటిలో ఇద్దరు నుంచి ముగ్గురు జ్వరాలతో మంచం పట్టారు. విషజ్వరాల లక్షణాలు ఉండడంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు మెట్‌పల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. కొందరు మాత్రం ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. మరికొందరి రక్త నమునాలు సేకరించి వైద్య పరీక్షల నిమిత్తం పంపించారు. గ్రామంలో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేశారు. వీధుల్లో బ్లీచింగ్ వేయించడంతో పాటు ఫాగింగ్ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచారు. జ్వరాలు విజృంభించడంతో అప్రమత్తమైన వైద్య శాఖ, ఇతర అధికారులు మంగళవారం గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారి ఇంటింటికీ వెళ్లారు. రోగుల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని పలు డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించడంతో పాటు పూడుకుపోయిన డ్రెయినేజీల్లో సిల్టు తొలగించి మురుగునీరు రోడ్లపైకి రాకుండా చూడాలని కోరుతున్నారు.

### వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

## స్వచ్ఛదనం–పచ్చదనం పకడ్బందీగా నిర్వహించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోరుట్ల రూరల్: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని 5 రోజుల పాటు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి అన్నారు. నాగులపేటలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులు, నీటి ట్యాంకుల క్లీనింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో 2వ రోజు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చేర్మెన్ అన్నం లావణ్య రోడ్ డివైడర్‌ల మధ్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, వైస్ చైర్మన్ పవన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత**

పెగడపల్లి:పరిసరాల పరిశుభ్రత పాటించడం ప్రతి ఒకరి బాధ్యతగా గుర్తించాలని మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛదనం–పచ్చదనంపై మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అధికారులు ఇంటింటా పర్యటించి శానిటేషన్, పరిశుభ్రతపై పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీవో మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్,అధికారులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం కోసమే మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న చైర్‌పర్సన్

జగిత్యాల: ప్రజారోగ్యం కోసమే మెగావైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం 8వ వార్డులో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లవ్వ, జయశ్రీ, పద్మ, లావణ్య పాల్గొన్నారు.

**పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత**

పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. 37వ వార్డులో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. వాటర్ ట్యాంకు క్లోరినేషన్‌ను పరిశీంచారు. ఈసందర్భంగా పరిశుభ్రత, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి



లింబాద్రిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్యులు

మల్లాపూర్: ఆర్యవైశ్యుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి అన్నారు. మల్లాపూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని, ఐక్యంగా ఉంటూ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య సంక్షేమ నిధిని ఏర్పాటు చేసుకుని సామాజిక కార్యక్రమాలతో పాటు నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని సూచించారు. మండల ఆర్యవైశ్య సభ్యులు సోమ అశ్విన్ నేతృత్వంలో లింబాద్రిని ఘనంగా సన్మానించారు. గురుకుల లైబ్రేరియన్ ఉద్యోగం సాధించిన మేడి శృతిని లింబాద్రి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకుతోట రాజేష్, లయన్స్ క్లబ్ రిజీయన్ చైర్మన్ శివ శ్రీనివాస్, నాయకులు రుద్ర రాంప్రసాద్, సిరిపురం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షిస్తాం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన రాజశేఖర్ గౌడ్ హత్యకు గురికాగా, బాధిత కుటుంబాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజశేఖర్ ను హత్య చేసిన నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని, వారికి కఠిన శిక్షపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిలువేరి నారాయణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జీవన్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ కడారి మల్లేశం, భూషణ్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, గాజుల అజయ్, తదితరులు పాల్గొన్నారు.

**పరామర్శ**

కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బేత్తేపు రాజేందర్ తండ్రి దేవయ్య గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం పరామర్శించారు.

## సంక్షిప్త వార్తలు

**▸ ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి**

కోరుట్ల: ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చా పట్టణ అధ్యక్షుడు బెక్కం అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశిపేట శివాజీ, నాయకులు దొనకొండ నరేష్, పీసరి నర్సయ్య, మహేష్ పాల్గొన్నారు.

**▸ నలంద విద్యార్థుల ప్రతిభ**

జగిత్యాల: శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ 2,4,6 సెమిస్టర్లలో నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. బీఎస్సీ విభాగంలో శ్రీజ 9.47 జీపీఏ, పూజిత 9.37, అక్షయ 9.25, ఒడ్నాల సుదీర్ 9.25, కల్యాణి 9.24, ఉషారాణి 9.18, రిషిక 9.15, శ్రీజ 9.12, శివాని 9.11, సుప్రియ 9.6, మాధురి 9.3, గుర్రం జ్యోత్స్న 9.3, శ్రీవిద్య 9.01, సిరిచందన 9, సాయిప్రియ 9, బీబీఏ విభాగంలో ప్రసాద్ 9.16 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ విద్యార్థులను అభినందించారు.

**▸ రేషన్ బియ్యం స్వాధీనం**

మల్యాల: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని మంగళవారం డీటీ సీఎస్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఆర్.తిరుపతి దాడి చేసి పది క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

**▸ సుష్మాస్వరాజ్‌కు నివాళి**

కథలాపూర్: దివంగత బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్ వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు మంగళవారం ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంటి సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, మల్యాల మారుతి, ఆనంద్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మహేశ్, లక్ష్మణచారీ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్ఫూర్తి ప్రదాత జయశంకర్



జగిత్యాలలో నివాళి అర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ, సిబ్బంది



మెట్‌పల్లిలో ఎమ్మెల్యే సంజయ్ నివాళి



రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో..

జగిత్యాలక్రైం/మెట్‌పల్లి/రాయికల్/ఇబ్రహీంపట్నం/ధర్మపురి/కథలాపూర్/పెగడపల్లి/సారంగాపూర్/మల్లాపూర్/గొల్లపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు మంగళవారం జిల్లా వ్యాప్తంగ ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ భీంరావు నివాళి అర్పించారు. మెట్‌పల్లిలో జయశంకర్ సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. తెలంగాణకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

### కొండగట్టు సమాచారం



శ్రీ ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. అంజన్న వసతి గదుల సమాచారం ఇలా ఉంది.

| కాంప్లెక్స్ పేరు | మొత్తం | అద్దె రూ. |
|---|---|---|
| అంజనాద్రి నిలయం | 20 | 300 |
| మారుతి నిలయం | 13 | 300 |
| హారతి గదులు | 09 | 100 |
| బుగ్గమటం | 02 | 700 |
| సాగర్ గెస్ట్ హౌస్ | 02 | 700 |
| పానా గెస్ట్ హౌస్ | 01 | 700 |

– కొండగట్టు

### ఎల్‌వోసీ అందజేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన ఉరుమట్ల గంగాధర్ కూతురు అనూష కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, చికిత్స కోసం ఇబ్బంది పడుతుండగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రూ.2.50 లక్షలఎల్‌వోసీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నక్కల రవీందర్‌రెడ్డి, బోనగిరి నారాయణ, భూపల్లి శ్రీనివాస్, పడిగెల స్వామిరెడ్డి పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మేడిపల్లి విద్యార్థులు

మేడిపల్లి: జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో ఉమ్మడి మేడిపల్లి మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గోవిందారం పాఠశాలకు చెందిన బత్తుల రజిత అండర్ –14 విభాగంలో 400 మీటర్ల రన్నింగ్ పోటీలో మొదటిస్థానం సాధించింది.భీమారం పాఠశాలకు చెందిన బండపల్లి అభిషేక్ అండర్–18 విభాగంలో 400 మీటర్ల రన్నింగ్ పోటీలో మొదటిస్థానంలో, జావెలిన్‌త్రో విభాగంలో రెండో స్థానంలో నిలిచాడు. కొండాపూర్ పాఠశాలకు చెందిన మర్రిపల్లి సిద్దార్థ అండర్–17 విభాగంలో 100 మీటర్ల రన్నింగ్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచాడు. వీరంతా ఆగస్టు 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, పీటీలు తెలిపారు.

**▸కూడళ్లలో అమరవీరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి**

కోరుట్ల: పట్టణంలోని రోడ్ డివైడర్ కూడళ్లలో స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ అమరవీరుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పలువురు యువజన సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్ తిరుపతికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ పెండెం గణేష్, జాల వినోద్, రుద్ర విఘ్నేష్, ఆనంద్, ప్రవీణ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

**▸సింగరావుపేట కార్యదర్శిపై ఫిర్యాదు**

రాయికల్: మండలంలోని సింగరావుపేట కార్యదర్శి బానోవత్ స్వర్ణ పై మంగళవారం గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, కార్యదర్శి గ్రామంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే డబ్బులు తీసుకుంటూ గ్రామ పంచాయతీలో జమచేయకుండా వాడుకుంటున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు క్యాతం సాయిరెడ్డి, జలపతి, మహేశ్, భీమయ్య, రవి పాల్గొన్నారు.

## నృసింహుని సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు



అడ్లూరికి స్వామివారి ప్రసాదం ఇస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు మేళతాళాలతో స్వాగతం పలికారు. ఆలయ సూపరింటెండెంట్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందించారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, అర్చకులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

వెల్గటూర్ : ఎండపల్లి మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, పూదరి రమేశ్, గెల్లు శ్రీనివాస్, తహసీల్దార్ రవికాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చెప్పేవన్నీ అబద్ధాలే

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహా మంత్రులు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడేవన్నీ అబద్ధాలేనని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు గడుస్తోందని, గత ప్రభుత్వ పథకాలను తొలగించటం తప్ప ఒక్క కొత్త పథకం కూడా ప్రారంభించలేదన్నారు. బడ్జెట్‌లో రైతుబంధు, కేసీఆర్ కిట్‌తోపాటు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించలేదన్నారు. మంత్రులకు వారివారి శాఖపై ఇంతవరకూ అవగాహన రాలేదన్నారు. బడ్జెట్ ప్రతుల్లో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ అని ప్రకటించి.. మైకుల్లో మాత్రం రాష్ట్రం దివాలా తీసిందని మాట్లాడారని పేర్కొన్నారు. కోరుట్ల ఆసుపత్రికి త్వరలోనే పరికరాలు, సిబ్బందిని నియమిస్తామని ఆరోగ్య మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు సింగిరెడ్డి నారాయణరెడ్డి, ఫయీం పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాల ప్రజలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సింగిల్ విండో చైర్మన్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌ను కలిసిన మున్నూరుకాపు నాయకులు



ప్రభుత్వ విప్‌ను సన్మానిస్తున్న కాపు నాయకులు

కథలాపూర్: తెలంగాణ మున్నూరుకాపు సంఘం అపెక్స్ చైర్మన్‌గా నియమితులైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను జిల్లా మున్నూరుకాపు సంఘం నేతలు మంగళవారం వేములవాడలో కలిసి సన్మానించారు. మున్నూరు కాపు సంఘం బలోపేతానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, బాదినేని రాజేందర్, మల్లారెడ్డి, సుధాకర్, లింగారెడ్డి, నర్సయ్య, రమేశ్ పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

కథలాపూర్/మేడిపల్లి: మండలంలోని గంభీర్‌పూర్‌లో జవ్వాజి కాశవ్వ, చిలివేరి నారాయణ అనారోగ్యంతో మృతిచెందగా, బాధితకుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. మేడిపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్ మంగళవారం పరామర్శించారు.

## బీర్‌పూర్ ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులపై మంగళవారం ఆలయ ఈవో శ్రీనివాస్ సమీక్షించారు. ఆలయ అభివృద్ధి కి మంజూరైన రూ. 35 లక్షల నిధులతో ఆలయ మంటప నిర్మాణ పనులు కొనసాగుతుండగా, పనులు నిర్వహిస్తున్న శిల్పులతో ఆయన చర్చించారు. అనంతరం ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన శనిగారపు రాజయ్య కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్,చిన్న సంతోష్, మధుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**▸ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి నిధులు మంజూరు**

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్‌లో నూతనంగా నిర్మించే రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం గౌడ సంఘం నాయకులకు అందజేశారు.